05092024-MAI-04_Layout 1 9/5/2024 2:54 AM Page 1

నేడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం

నమస్తే తెలంగాణ

విపక్షంపై ఘాతుక దాడి

తెరిపి లేకుండా వానలు, వరదలతో ప్రజలు సతమతమవుతున్నారు. బాధితులకు కావాల్సింది ఒకింత ఓదార్పు, కాసింత చేయూత. కానీ, జరుగుతున్నదేమిటి? రాజకీయాలకతీతంగా ప్రజలకు సహాయం అందించాల్సిన విపత్తు సమయంలో విపక్షాలపై పాలకపక్షం నిస్సిగ్గుగా దాడులకు తెగబడుతున్నది. స్వయంగా ముఖ్యమంత్రి, మంత్రులు నోరు పారేసుకుంటున్నారు. సమయం, సందర్భం లేకుండా విపక్షంపై దాడి చేయడం ప్రభుత్వ పెద్దల్లోని అభద్రతా భావానికి, అసహనానికి అద్దం పడుతున్నది. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం వారు ముందే హెచ్చరించినా ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమైంది. అదేవిధంగా వర్షాలు కురిసిన తర్వాత సహాయక చర్యల్లోనూ సర్కారు వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఇది కళ్లెదుట కనిపించే కాదనలేని వాస్తవమే. సర్కారు చేతకానితనాన్ని ప్రజలు నిలదీస్తున్నారు. ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డికే డౌన్‌డౌన్ నినాదాలు, నిరసనలు స్వాగతం పలుకుతున్నాయి. మంత్రులను బాధితులు అడ్డగిస్తున్నారు, నిలదీస్తున్నారు. రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు చెంపలు వేసుకుంటున్నామని అంటున్నారు. ఇదివరకటి ప్రభుత్వ హయాంలో విపత్తు సహాయక చర్యలు సమర్థంగా అమలుకావడం గురించి ప్రజలు చెప్పుకొంటున్నారు. నాడు బీఆర్ఎస్ నేతలు చేసిన సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

బాధితులకు భరోసా ఇచ్చేందుకు బీఆర్ఎస్ నేతలు చేపట్టిన పరామర్శ పర్యటనపై కాంగ్రెస్ గూండాగిరికి దిగడం దారుణం. బీఆర్ఎస్ నేతలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల కాన్వాయ్‌పై విరుచుకుపడి వీరంగం వేయడం అమానుషం. ఇదేదో క్షణికావేశంలో జరిగిన దాడి కాదు. రాళ్లు, కర్రలతో వాహనాలను ధ్వంసం చేయడమే అందుకు నిదర్శనం. దాడిలో మాజీ మంత్రులు హరీశ్ రావు, పువ్వాడ అజయ్ కార్లు దెబ్బతినడం చూస్తుంటే ఒక పథకం ప్రకారమే ఈ దాడి జరిగిందని స్పష్టంగా తెలుస్తున్నది. ఇదంతా జరుగుతుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం మరీ విచిత్రం. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆదేశాలతోనే దాడి జరిగిందనే అనుమానాలు సహజంగానే వ్యక్తమవుతున్నాయి. సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న బీఆర్ఎస్ నేతలకు ప్రజల నుంచి ఆత్మీయ స్పందన రావడం సీఎం రేవంత్‌రెడ్డికి గిట్టడం లేదా? విపత్తు నష్టాలను, మృతుల సంఖ్యను తగ్గించి చూపుతూ ఆత్మ సమర్థనలో పడిన కాంగ్రెస్ పాలకులకు కంటగింపుగా మారిందా? ఆ నిస్పృహతోనే తెలంగాణలోకి గూండా రాజకీయం తెస్తున్నరా?

సుమారు పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ లేవు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలక, విపక్షాల మధ్య రాజకీయ చర్చ జరగాలి. వాదన అంతమైన చోటే హింస మొదలవుతుందని పెద్దలు చెప్పిన మాట ఈ సందర్భంగా గుర్తుకువస్తున్నది. సహాయక కార్యక్రమాలు సజావుగా జరగలేదని ప్రజల తరపున విమర్శించే హక్కు విపక్షాలకు ఎప్పుడూ ఉంటుంది. వీలైతే జవాబు చెప్పాలి లేదా క్షమాపణ కోరాలి. ఇది సంస్కారవంతులైన రాజనీతిజ్ఞులు చేసే పని. కానీ, పెనం మీద పేలపు గింజలా ఎగిరెగిరిపడే రాజకీయ మరుగుజ్జుల తీరు వేరు. పొద్దున లేస్తే విపక్షాలను ఆడిపోసుకుంటూ పిల్లిశాపాలు పెట్టే సీఎం రేవంత్‌రెడ్డి నుంచి సరైన స్పందన వస్తుందనుకోవడం అత్యాశే అవుతుంది. సొంత ఊళ్లో మీడియాపై ముష్కర దాడి జరిపించిన చరిత్ర ఆయనది. ఒకటి మాత్రం నిజం. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. సరైన సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ మార్క్ గూండా రాజకీయాలకు కర్రు కాల్చి వాతపెట్టడం ఖాయం.

పదేండ్ల జన్‌ధన్‌తో ఏం ప్రయోజనం?

2024, ఆగస్టు 28 నాటికి ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకానికి పదేండ్లు పూర్తయ్యాయి. 2014 మే నెలలో తొలిసారి ప్రధానిగా పీఠమెక్కిన నరేంద్ర మోదీ తన ప్రతి నిర్ణయం ఒక సంచలనం కావాలనే జోరు మీదున్నారు. ఆ క్రమంలో 2014, ఆగస్టు 15 నాడు 'పీఎం జన్‌ధన్ యోజన' పథకాన్ని ప్రకటించారు. పైసా డిపాజిట్ లేకుండా దేశంలో ఉన్నవారందరికీ పొదుపు ఖాతాలు తెరవాలని బ్యాంకులను ఆదేశించారు. నిజానికిది 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన 'జీరో బ్యాలెన్స్' ఖాతాకు నకలు మాత్రమే. అవి కొనసాగుతూ 2014 వరకు లక్షలాది జీరో బ్యాలెన్స్ ఖాతాలు బ్యాంకు రికార్డుల్లోకి ఎక్కాయి. దానికి బీమా, ఓవర్‌డ్రాఫ్ట్ వంటివి జోడించి ప్రధాని మోదీ కొత్త పేరును పెట్టారు. ఉత్తర భారతంలో దీన్ని 'మోదీ ఖాతా'గా పిలుస్తుంటారు.

బి.నర్సన్
94401 28169

ప్రధాని మోదీ ఆదేశాల మేరకు 2014, ఆగస్టు 23 నుంచి 29 వరకు వారం రోజుల పాటు బ్యాంకులు ఆ ఖాతాల పనిలో పడ్డాయి. జనాలతో బ్యాంకులు కిక్కిరిసిపోవటంతో ప్రజల వద్దకే బ్యాంకు ఉద్యోగులు వెళ్లారు. తత్ఫలితంగా జనాలు ఊళ్లలోని కూడళ్లలోకి వచ్చి మరీ ఖాతాలు తెరిచారు. ఖాతాల్లేవని వెళ్లగొట్టే బ్యాంకువాళ్లు 'రండి! రండి!' అని రోడ్లపైకి రావడం అందరికీ వింతగా అనిపించింది. ఏదో ఒక గుర్తింపు కార్డు చూపిస్తే చాలు ఖాతా చేతికి వచ్చినట్టే. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తెచ్చి ఒక్కొక్కరి ఖాతాలో వేస్తామని అప్పటికే మోదీ ప్రకటించినందు వల్ల ఆ ఆశతో కోట్లాది మంది ఖాతాలను తెరిచారు. అప్పటికే అకౌంట్ ఉన్నవాళ్లు కూడా ప్రభుత్వ పథకాలకు విడిగా ఓ ఖాతా ఉండాలేమో అనుకొని 'జన్‌ధన్' ఖాతా కూడా తెరిచారు. 2014 ఆగస్టు చివరి వారంలో తెరిచిన జన్‌ధన్ ఖాతాల సంఖ్య కోటి 81 లక్షలు. అది ఓ గిన్నీస్ రికార్డు. ఈ దశాబ్ద కాలంలో ఆ యోజన ఫలితంగా 53 కోట్ల బ్యాంకు ఖాతాల్లో రూ.2.31 లక్షల కోట్లు జమయ్యాయని ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది.

ఈ ఖాతాదారులకు రూ.30 వేల జీవిత బీమా, రూ.2 లక్షల ప్రమాద బీమాతో పాటు రూ.10 వేలు ఓవర్‌డ్రాఫ్ట్ అప్పుగా లభించడం ఈ పథకంలోని ప్రత్యేకత. 6 నెలల కాలంలో ఖాతాలో కనీస నాలుగు లావాదేవీలుంటేనే ఓవర్‌డ్రాఫ్ట్‌కు అర్హత ఉంటుంది. అయితే, బ్యాంకులు ఇంటికి దూరంగా ఉండటంతో పని వదిలేసుకొని ఈ లావాదేవీలు నడిపినవారు తక్కువ. మామూలు సెల్‌ఫోన్‌కు సమాచారం అందించే వ్యవస్థ ఉన్నా అన్ని గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేనందువల్ల ఏ విషయం వారికి చేరకపోవడం మరో అడ్డంకి. దేశంలోని గ్రామాల్లో చిన్న నగదు లావాదేవీలు నడపడానికి వీలుగా ఆర్బీఐ బిజినెస్ కరస్పాండెంట్ వ్యవస్థకు అనుమతినిచ్చింది. దీని ఆధారంగా బ్రాంచీలకు దూరంగా ఉన్న గ్రామాల్లో ఆయా సర్వీస్ బ్యాంకుల ద్వారా 'బ్యాంకు మిత్ర'ల నియామకం జరిగింది. అయితే వారికి తక్కువ జీతంతో పాటు ఎలాంటి సర్వీస్ రూల్స్, క్రమశిక్షణ చర్యల విధానం లేకపోవడం వల్ల ఎవరూ నిలకడగా ఉండటం లేదు. పైగా, అక్షరజ్ఞానం లేని గ్రామీణులను కొందరు మోసం కూడా చేస్తున్నారు.

> **2017లో అవినీతికి పాల్పడ్డ బ్యాంకుమిత్రులు 20 శాతం ఉండగా ఏటా వారి సంఖ్య పెరుగుతున్నదని పలు నివేదికలు చెప్తున్నాయి. బ్రాంచీల విస్తరణ లేదా బ్యాంకు సిబ్బందే వారానికి ఒక రోజు గ్రామాల్లోకి వెళ్లడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు.**

హంగామాగా ఆరంభించిన జన్‌ధన్ యోజన ప్రయోజనాల గురించి ప్రజల్లోకి సరిగా వెళ్లలేదనే చెప్పాలి. ప్రభుత్వం దీని నిర్వహణకు ఒక పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటుచేయలేదు. డబ్బు అవసరం ఉన్నవారికి, సామాన్యులకు బ్యాంకు ఓవర్‌డ్రాఫ్ట్ ఎంతో ఉపయోగకరం. అయితే దీని గురించి ఖాతాదారులకు తెలిపే ప్రయత్నం ప్రభుత్వం కాని, బ్యాంకులు కాని చేయడం లేదు. ఎలాంటి గ్యారెంటీ లేకుండా సామాన్యుడికి పది రూపాయలు ఇవ్వడానికి కూడా బ్యాంకులు ముందుకురావు. ఓవర్‌డ్రాఫ్ట్ ఇస్తే ఆ సొమ్ము తిరిగిరాదని బ్యాంకర్ల విశ్వాసం, అనుభవం. 2016, డిసెంబర్‌లో ప్రభుత్వం ఇచ్చిన వివరాల ప్రకారం 30 కోట్ల ఖాతాల్లో 45 లక్షల మందికి ఓవర్‌డ్రాఫ్ట్ అందింది. అంటే, అది 2 శాతం కూడా కాదు. ఖాతాలో లావాదేవీలు నడిపించి ఓవర్‌డ్రాఫ్ట్ అందేలా ప్రజలకు సాయపడే బాధ్యతను ప్రభుత్వం ఏదైనా గ్రామీణ శాఖకు కట్టబెట్టాలి. ఊర్లలో రికవరీ బృందాలను ఏర్పాటుచేసి మళ్లీ తిరిగి కట్టేలా చర్యలు తీసుకోవాలి. ఓవర్‌డ్రాఫ్ట్ రికవరీ సంతృప్తిగా ఉంటే ఆ సొమ్మును పెంచడానికి కూడా బ్యాంకులు ముందుకు రావచ్చు. ప్రైవేటు లోన్‌యాప్‌ల ద్వారా చిన్న మొత్తాలు తీసుకొని అధిక వడ్డీ, పెనాల్టీలు కట్టలేక ప్రాణం మీదికి తెచ్చుకొన్న వార్తలు ఎన్నో ఉన్నాయి.

2022లో జన్‌ధన్ యోజన ఖాతాల పరిస్థితిపై రాజస్థాన్ గ్రామాల్లో ఇన్‌స్ప్రైరా జర్నల్స్ సేకరించిన వివరాల ప్రకారం ఒక శాతం మాత్రమే ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకున్నారు. ఖాతా తెరిచిన నాటి నుంచి 47 శాతం మంది ఒక్క లావాదేవీ కూడా జరపలేదు. 37 శాతం మందికే రూపే కార్డులు అందాయి. వారిలో రూపే కార్డులను రెన్యూవల్ చేసుకున్నవారు తక్కువే. 59 శాతం మంది తగిన ఆదాయం లేక ఖాతాను నడపడం లేదు. 33 శాతం మందికి ఇదివరకే బ్యాంకు ఖాతాలున్నాయి. ప్రభుత్వం డబ్బులు వేస్తుందని ఈ ఖాతాను కూడా తెరిచామని వారంటున్నారు. కేవలం ఖాతాల సంఖ్య, అందులో జమైన సొమ్మును ప్రచారం చేసుకొని ఈ పథకం గొప్ప ఫలితాలను సాధించిందని ప్రభుత్వం చెప్పుకోవడం తగదని, జన్‌ధన్ యోజన లక్ష్యాలు, ప్రయోజనాలు ఖాతాదారులకు అందినప్పుడే అది నిజమైన విజయమని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ చెప్పడం గమనార్హం.

గరీబ్ కళ్యాణ్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఈ ఖాతాల్లో రూ.10,300 కోట్లు వేయగా, అందులోంచి రూ.4 వేల కోట్లు మాత్రమే విత్‌డ్రా అయ్యాయని తెలుస్తున్నది. అంటే, తమ ఖాతాల్లో డబ్బు పడిన సమాచారం చేరవేసే వ్యవస్థ కూడా లేదన్నమాట. ఈ మధ్య బయటపడిన మరో విషయమేమంటే ఈ ఖాతాలు సైబర్ మోసగాళ్లకు ఉపయోగపడుతున్నాయట. ఈ ఖాతాలు తెరిచేప్పుడు ఎలాంటి కేవైసీ నిబంధనలు పాటించలేదు కాబట్టి, ఆయా వ్యక్తులను పట్టుకోవడం ఇప్పుడు కష్టమే. కోట్లలో జన్‌ధన్ ఖాతాలున్నందువల్ల కోరుకున్నన్ని ఖాతాలు సైబర్ నేరాలకు వాడుకోవచ్చు. ఖాతాదారు రూపే కార్డును తీసుకుంటే ఎక్కడి నుంచైనా డబ్బులు డ్రా చేసుకోవచ్చు. ఇంత వైఫల్యం, దుర్వినియోగం అవుతున్న జనధన్ యోజన పథకాన్ని కేంద్రం లక్ష్యసాధన దిశగా, ప్రజలకు ఆర్థిక సహాయకారిగా మలచాల్సిన అవసరం ఎంతో ఉన్నది.

విష రసాయనాలతో వినాయకుడా?

డాక్టర్ శ్రీదరాల రాము
94411 84667

'వినాయక చవితి' హిందువులకు అతి ముఖ్యమైన పండుగ. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా గణపతి ప్రతిమను భక్తిశ్రద్ధలతో పూజించి, ఆ తర్వాత నీటిలో నిమజ్జనం చేయడం ఏటా ఆనవాయితీగా జరిగే కార్యక్రమం. అయితే, ఈ పండుగ జరుపుకొనే విధానం అసలు సంప్రదాయానికి అనుగుణంగా ఉన్నదా, లేదా? అనే విషయాన్ని భక్తులు ఆలోచించుకోవాల్సిన అవసరం ఉన్నది. సంప్రదాయం ప్రకారం ప్రకృతిలో లభించే మట్టితో వినాయకుని ప్రతిమను తయారుచేసి పత్రి, పూలతో ఘనంగా పూజించిన తర్వాత, ఆ వినాయకుడిని మళ్లీ అదే ప్రకృతి ఒడిలోకి చేర్చాలి.

వినాయకుడి ప్రతిమను తయారుచేయడం నుంచి పూజించడం, నిమజ్జనం చేయడం దాకా అంతా ప్రకృతి కేంద్రంగా జరుగుతుంది. అంటే, సంప్రదాయ పూజ పద్ధతిలో 'రీసైకిల్' అనే ఒక పర్యావరణ నియమం మనకు స్పష్టంగా కనబడుతుంది. కానీ, ప్రస్తుతం సమాజంలో వినాయక చవితి పండుగ జరుపుకొనే విధానం పర్యావరణ విధ్వంసం కలిగించే విధంగా ఉంటున్నది. మట్టితో తయారుచేసిన ప్రతిమలకు బదులుగా 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్' అనే విష రసాయనాలతో తయారుచేసిన విగ్రహాలను పూజించడం ఆనవాయితీగా మారిపోయింది.

'మట్టి' జీవం గల ఒక పదార్థం. అందుకే మొక్కల నుంచి మహా వృక్షాలు సహా అనేక జీవజాతులకు అది జీవం పోస్తుంది. అందుకే, మట్టి వినాయకుడిని పూజించడమంటే ఒక సజీవమైన దేవుడి ప్రతిమను పూజించినట్లుగా భావించాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌లో ఎలాంటి మొక్కలు, జీవజాతులు పెరగవు. ఎందుకంటే, ఇది జీవులను నశింపజేసే ఒక నిర్జీవ విష పదార్థం. అంతేకాదు, వినాయక ప్రతిమలను అందంగా అలంకరించడం కోసం వాడుతున్న రంగులు కూడా ఆ ప్రతిమలను మరింత విషపూరితంగా మారుస్తున్నాయి. అంటే, భక్తులు తొమ్మిది రోజుల పాటు పూజిస్తున్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు ఒక నిర్జీవమైన, జీవం లేని విష పదార్థాలతో కూడినవేననటంలో సందేహం లేదు. మరి, ఇలాంటి ప్రతిమలను పూజిస్తే ఫలితం దక్కుతుందో, లేదో భక్తులే శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించుకోవాలి. అంతేకాదు, పూజించిన తర్వాత దుర్గంధంతో కూడిన ట్యాంక్‌బండ్ వంటి మురికి నీటిలో ఆ ప్రతిమను నిమజ్జనం చేయడమంటే దేవుడిని పూర్తిగా అగౌరవపరిచినట్టే. ఎందుకంటే అలాంటి దుర్గంధపు నీటిలో మనమే స్నానం చేయం!

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పర్యావరణానికి హాని చేస్తాయి. అవి చెరువు అడుగు భాగంలో ఘన, వ్యర్థ పదార్థంగా ఉండిపోయి క్రమేపి పూడిక పరిమాణాన్ని పెంచుతాయి. అధిక మొత్తంలో కాల్షియం, మెగ్నీషియం లవణాలుండటం వల్ల అవి నీటి కఠినత్వాన్ని పెంచడమే కాకుండా, చెరువుల్లోని నీటిని ఉప్పు నీరుగా మారుస్తాయి. ఈ విగ్రహాలు తయారుచేసేటప్పుడు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ గాల్లోకి విడుదల చేసే వాయువులతో శ్వాసకోశ వ్యాధులు సంక్రమించే అవకాశాలున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వ్యర్థాలు కలిగిన నీటిని సాగుకు వాడినప్పుడు కాలక్రమేణా సారవంతమైన వ్యవసాయ భూములు నిస్సారంగా మారి వ్యవసాయానికి పనికిరాకుండా పోతాయి. వీటిలో వాడే కొబ్బరి పీచు నీటిలో కుళ్లిపోతుంది. తద్వారా నీటిలోని ఆక్సిజన్ స్థాయులు తగ్గిపోతాయి. కొబ్బరి పీచులోని రసాయన సమ్మేళనాలు నీటిలోకి విడుదల కావడం వల్ల నీటిలో ఆమ్లత్వం పెరుగుతుంది. విగ్రహాల సుందరీకరణ కోసం వాడే రంగులు క్యాన్సర్ కారకాలు. ఈ రంగుల వల్ల చెరువుల్లోని నీటి రంగు కూడా మారిపోతుంది. 'బయో మాగ్నిఫికేషన్' ప్రక్రియ ద్వారా రంగు పదార్థాలు మానవుల శరీరంలోకి ప్రవేశిస్తాయి. అంతేకాదు, ఆ రంగునీళ్లలో నివసించే చేపల వంటి జలచరాలలోకి, మొక్కల్లోకి ప్రవేశించి ఆహారం ద్వారా మనుషుల శరీరాల్లోకి కూడా ప్రవేశిస్తాయి.

ఒకప్పుడు మహా గణపతి నవరాత్రి ఉత్సవాలకు మాత్రమే పరిమితమైన ఈ పద్ధతి, ఈ మధ్యకాలంలో దసరా నవరాత్రి ఉత్సవాల పేరిట కూడా కొనసాగుతున్నది. మనం నిత్యం తాగే నీటి వనరులను కలుషితం చేయడం వల్ల ఆ నీటిని మళ్లీ మంచినీరుగా మార్చుకోవడానికి పెద్దమొత్తంలో ఖర్చుచేసి రివర్స్ ఆస్మాసిస్(ఆర్వో) వంటి ఖరీదైన టెక్నాలజీలతో శుభ్రపరచాల్సిన పరిస్థితి వస్తున్నది. ఆ నీటిలో సరైన మినరల్స్ లేకపోవడం వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. కాబట్టి ప్రకృతి మనకు సహజంగా ఇచ్చిన వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది. పెరుగుతున్న జనాభాకనుకూలంగా రాబోయే తరాలకు ఆరోగ్యవంతమైన నీటి వనరులను అందించాలి. పర్యావరణ కలుషితానికి కారణమయ్యే విషపూరిత ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను పూజించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదనే విషయాన్ని భక్తులు గ్రహించాల్సిందిగా మనవి.

(వ్యాసకర్త: ఫ్యాకల్టీ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, హైదరాబాద్)

ఇకనైనా రేవంత్ మారతారా!

చిన్నప్పుడు చదివిన చందమామ కథల్లో ఈ కథ బాగా గుర్తుండిపోయింది. ఒక ఏనుగు తొండంతో పూలమాలను పట్టుకెళ్తూ తనకు నచ్చినవారి మెడలో ఆ మాల వేసేది. ఏనుగు ఆ మాలను ఎవరి మెడలో వేస్తే వారే ఆ దేశానికి రాజు. ఏనుగు పూలమాలను వేయగానే అతన్ని రాజుగా పట్టాభిషేకం చేస్తారు. కథ అక్కడితో ముగుస్తుంది. నిజానికి కథ అక్కడితో ముగిస్తేనే బాగుంటుంది. కానీ, ఏనుగు దండ వేశాక రాజుగా బాధ్యతలు స్వీకరించాక అతను ఉపన్యాసమిస్తే ఎలా ఉంటుందోననే కుతూహలం నాలో ఉండేది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉపన్యాసాలను విన్నప్పుడల్లా నాకు ఈ కథ గుర్తుకొస్తూ ఉంటుంది.

బుద్దా మురళి

శాసనమండలి సభ్యురాలు కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేశాక, అత్యున్నత న్యాయస్థానాన్ని కించపరిచే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడిన తీరు వ్యక్తులుగా వారి స్థాయికి తగినట్టుగా ఉండవచ్చు, వారి అభిమానులు చప్పట్లు కొట్టే విధంగా ఉండవచ్చు. కానీ, వారు చేపట్టిన పదవులకు తగిన స్థాయిలో మాత్రం లేవు. కోర్టు నిర్ణయం పైనే కాదు, అన్ని చోట్ల వారి ప్రసంగాలు అదే స్థాయిలో ఉంటున్నాయి. సుప్రీంకోర్టు స్వయంగా తప్పు పట్టడం వల్ల వారి ప్రసంగాలు చర్చలోకి వచ్చాయి.

గుజరాత్‌లో అత్యంత ఎత్తయిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ విగ్రహాన్ని స్వయంగా ప్రధాని మోదీ ఏర్పాటు చేశారు. మహాత్మా గాంధీ, నెహ్రూ కన్నా పటేల్ మహానాయకుడు అనేది బీజేపీ అభిప్రాయం. అలాంటి పటేల్ నిర్వహించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ తాను మాట్లాడేప్పుడు తన అభిమానులను కాకుండా ఒక్కసారి పటేల్‌ను గుర్తుకు తెచ్చుకుంటే కొద్దిగా అయినా హుందాగా మాట్లాడటం అలవాటు అవుతుందేమో. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికే అత్యున్నత న్యాయస్థానం నిర్ణయం పట్ల గౌరవం లేకపోతే ఎలా? ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలపై సుప్రీంకోర్టు ఒకసారి కాదు, రెండు సార్లు తీవ్రంగా స్పందించింది. 'నాయకులను సంప్రదించి నిర్ణయాలు తీసుకుంటామా? ముఖ్యమంత్రి వంటి బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నవారు మాట్లాడాల్సిన మాటలేనా ఇవి?' అని రేవంత్‌ను సుప్రీం న్యాయమూర్తులు ప్రశ్నించారు.

తర్వాత కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియా ఖాతాలో బెయిల్‌పై చేసిన రాజకీయ విమర్శలపై సుప్రీం అసంతృప్తి వ్యక్తం చేసింది.

> **ఫలానా కంపెనీ ఉత్పత్తి కంటే తమ ఉత్పత్తే మంచిదని ఏ వ్యాపార సంస్థ అయినా ప్రచారం చేసుకుంటుంది. అది సహజం. రాజకీయ వ్యాపారంలో రాజకీయ పార్టీలు సైతం అదే విధంగా విమర్శించుకుంటాయి. రాజకీయ వ్యాపారంలో పరస్పర విమర్శలు సహజమే. కానీ, ఉన్నత స్థానాల్లో ఉన్నవారు బూతులకు, విమర్శలకు, ఆరోపణలకు తేడా తెలుసుకోవాలి.**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలను సుప్రీంకోర్టు తప్పుపట్టడమంటే అది ఆయనకు, కాంగ్రెస్ పార్టీకి మాత్రమే అవమానకరం కాదు, యావత్ తెలంగాణ ప్రజలకూ అవమానకరమే. రేవంత్ రెడ్డి పాఠశాల పిల్లలను ఉద్దేశించి మాట్లాడినా బూతులే మాట్లాడుతున్నారు. వాటిని తన ట్రేడ్‌మార్క్‌గా ఆయన మార్చుకున్నారు. మైకు ముందుకు వెళ్లేటప్పుడు తాను ముఖ్యమంత్రిని అనే విషయాన్ని రేవంత్ రెడ్డి ఒకసారి గుర్తు చేసుకొని ఉపన్యాసం మొదలుపెడితే తన మాటతీరు మారవచ్చు. తన తిట్ల వల్లనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందనే భ్రమ ఆయనకు ఉంటే చేయగలిగిందేమీ లేదు. బీఆర్ఎస్‌ను ఓడించి, కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారు. అంతేకానీ, రేవంత్‌రెడ్డిని గెలిపించలేదు. కాంగ్రెస్ అధిష్ఠానం చల్లని చూపు ఉన్నంత వరకే ఆయన మాట చెల్లుబాటవుతుంది. ఆయన తిట్లు కూడా అంతవరకే నచ్చుతాయి.

పాలనపై పట్టు సాధించే విషయం ఎలా ఉన్నా రేవంత్ రెడ్డి మాత్రం బూతులపై పట్టు సాధించారు. రేవంత్ శాసనమండలి సభ్యుడిగా ఉన్నప్పుడు మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్తు సమావేశం జరుగుతున్న సమయంలో అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే డీకే అరుణను కొట్టినంత పనిచేశారు. రావుల చంద్రశేఖర్‌రెడ్డి పట్టుకొని ఆయనను వెనక్కి లాగారు. టీడీపీ, కాంగ్రెస్ నాయకుడిగా ఉన్నప్పటి పరిస్థితి వేరు. ఆ ఆవేశం, తిట్లు రాజకీయంగా ఎదగడానికి, అభిమానులు చప్పట్లు కొట్టడానికి ఉపయోగపడి ఉండవచ్చు. ముఖ్యమంత్రి స్థాయిలో కూడా అవే ఉపయోగపడతాయని అనుకుంటే పొరపాటే. రాహుల్ గాంధీ పుట్టుక గురించి బీజేపీ నాయకులు విమర్శిస్తే.. ప్రత్యర్థి పార్టీ అయినప్పటికీ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించారు. తమ నాయకుడి గురించి మాట్లాడినా కాంగ్రెస్ నేతలు స్పందించలేదు. అయినా కేసీఆర్ స్పందించారు.

రజత్ శర్మ ఆప్ కీ అదాలత్ వీడియో ఒకటి ఈ మధ్య చూశాను. వాజపేయిని రజత్ శర్మ కలిసినప్పుడు.. 'మీరు ఎంత ఉన్నతస్థాయికి వెళ్తే.. సహన శక్తి అంతగా పెంచుకుంటూ ఉండాల'ని చెప్పారట. మాట్లాడే కళ నేర్పించాలని వాజపేయిని రజత్ శర్మ అడగగా.. 'నా నుంచి మాట్లాడే కళ కాదు.. నేర్చుకోవాలనుకుంటే, మౌనంగా ఉండటం నేర్చుకో' అని వాజపేయి బదులిచ్చారట. అందుకే వాజపేయి లాంటి వారిని పార్టీలకతీతంగా అందరూ గౌరవిస్తారు.

గురుకులాల విలీనం.. ఓ కుట్ర

బడిబాట పట్టాలనే సంకల్పంతో ఎస్ఆర్ శంకరన్, మాజీ మంత్రి, స్వర్గీయ మహేంద్రనాథ్ లాంటి మహనీయుల ఆలోచనల నుంచి పుట్టుకొచ్చినవే గురుకులాలు. స్వరాష్ట్రంగా తెలంగాణ ఏర్పడ్డాక నాటి కేసీఆర్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద విద్యార్థుల కోసం ప్రత్యేకంగా అనేక గురుకులాలను ఏర్పాటుచేసింది. దాంతో గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందింది. అయితే ఎంతోమందికి చేయూతనిచ్చిన గురుకులాలు నేడు నిర్వీర్యమవుతుండటం ఆందోళనకరం.

పబ్బతి శ్రీకృష్ణ
95334 11328

గురుకులాల్లో చదువుతున్న అణగారినవర్గాల పిల్లలు ఉన్నతస్థాయికి చేరుకోవడం కొందరికి నచ్చడం లేదు. అందుకే వారిని విద్యకు దూరం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. పాలకులే ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు నడుపుతూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారు. తద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థను సమూలంగా నాశనం చేస్తున్నారు.

గురుకుల విద్యార్థులు అన్నిరకాల ప్రవేశ పరీక్షల్లో ముందంజలో నిలుస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీపడి ఇంజినీరింగ్, మెడికల్, లా తదితర కోర్సుల్లో చాలామంది సీట్లు సంపాదిస్తున్నారు. గురుకులాల ద్వారానే దళిత, బహుజన కుటుంబాలు అభ్యున్నతి చెందుతున్నాయన్నది నగ్న సత్యం. ఇది రుచించుకోని అగ్రకులాలు గురుకులాలపై కుట్రలు పన్నుతున్నారు. అందులో భాగంగానే 'మనమంతా ఒక్కటే' అనే కపట నాటకానికి తెరతీశారు. వాస్తవానికి అందరమొక్కటే అయినప్పుడు ఇంటర్నేషనల్, నేషనల్, ఒలింపియాడ్, కార్పొరేట్ పాఠశాలలు ఎందుకున్నట్టు? నేటికీ బిజినెస్ స్కూళ్లలో రిజర్వేషన్లు ఎందుకు లేవు? అందరం ఒక్కటే అయినప్పుడు ఎలాంటి వివక్ష ఎదుర్కోని అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఎందుకు? బడుగు, బలహీనవర్గాల కంటే అతి తక్కువ మార్కులు వచ్చినవారికి సీట్లు, ఉద్యోగాలు ఎందుకొస్తున్నాయి? అనేక కులాలను బీసీల జాబితాలో చేరుస్తూ బీసీలను మరింత బలహీనంగా ఎందుకు మారుస్తున్నారు? ఈ ప్రశ్నల్లో ఏ ఒక్కదానికీ పాలకుల వద్ద సమాధానాల్లేవు. ఎంతటి దుర్మార్గమైన అణచివేత ఇది.

'అన్ని కులాలకు కలిపి ఒకే గురుకులాలు' అని కాంగ్రెస్ సర్కార్ ప్రకటించడం వెనుక ఆంతర్యం ఏమిటి? ఈ ప్రకటనలోనే పాలకుల కుట్ర దాగి ఉన్నది. కామన్ గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రావాల్సిన 75 శాతం సీట్లు నష్టపోవడం ఖాయం. గురుకులాల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. ఉన్నతాధికారుల పెత్తనం కారణంగా గురుకులాలు వ్యాపార కేంద్రాలుగా మారాయి. ఈ సమస్యలపై గతంలో గురుకులాల సెక్రెటరీకి మాల మహానాడు విన్నవించినా పట్టించుకోలేదు.

గురుకుల పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించడం లేదు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతోనే రాష్ట్రంలోని అన్ని గురుకులాలు నడుస్తున్నాయి. ఇలా గురుకులాలను వెంటాడుతున్న వివిధ సమస్యలు తమ ప్రతిభకు అడ్డంకిగా మారాయని విద్యార్థులు భావించడం లేదు. సమస్యలతో సహవాసం చేస్తూనే నీట్, జేఈఈ లాంటి జాతీయ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపుతున్నారు. గురుకులాల పేరు నిలబెడుతున్నారు. అయినప్పటికీ నాణ్యమైన విద్యను అందించాల్సిన పాలకులు వారిని మోసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురుకులాల్లో తిష్టవేసిన సమస్యలను వెంటనే పరిష్కరించి, బంగారు భవితకు బాటలు వేయాల్సిన అవసరం ఉన్నది.

(వ్యాసకర్త: మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు)